జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 22 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5

## యాతాలకుంట టన్నెల్ పనులను తనిఖీ చేసిన మంత్రి తుమ్మల

- పనులు త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులు ఆదేశం



**సత్తుపల్లి సెప్టెంబర్21(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మండల పరిధిలోని యాతాలకుంట సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్ పనులను ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ల్యాండ్ ఎక్విజేషన్ కంప్లీట్ కావాలని, రైతులకు సకాలంలో నీరందించాలని, అధికారులకు ఆదేశించారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద సీతారామ పంప్ హౌస్ పరిస్థితిలను, అక్కడ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఆయన వెంట అశ్వరావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు ఉన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి




- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- 2026–27లో భూసేకరణకు రూ. 6 వేల కోట్ల నిధులు విడుదల
- అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులు తక్షణమే పూర్తి చేయాలి
- నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు,సీఎస్

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు

మిగతా 2 లో...




# ప్రభుత్వ ఫలాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా ప్రకారం సంపూర్ణంగా అందాలి

- ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే ని పకడ్బందీగా నిర్వహించాలి
- గురుకులాల్లో మౌళిక వసతులు కల్పించాలి
- పారిశుద్ధ్య కార్మికులకు కోటి రూపాయల భీమా కల్పించాలి
- జిల్లాలోని అన్ని అంగన్వాడీలకు స్వంత భవనాలు నిర్మించాలి
- ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి, అధికారులతో భూమి, సర్వీసెస్, అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

### తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** దామాషా ప్రకారం ప్రభుత్వ ఫలాలు సంపూర్ణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందాలని, ఈ దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమీషన్ సభ్యులు కుస్రం నీలాదేవి,రాంబాబు నాయక్,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి భూమి, సర్వీసెస్, అట్రాసిటీ కేసులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు,ఎస్సీ, ఎస్టీల కోసం పథకాల అమలు, అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి

మిగతా 2 లో...

## కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన నడుస్తుంది

- బిఆర్ఎస్ హయాంలో స్వర్ణయుగం నడిచింది
- బోనకల్ బీఆర్ఎస్ కార్యాలయం ప్రజల కోసం పనిచేసే పోరాట కేంద్రం
- ప్రజలను నయవంచన చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- కెసిఆర్ ను అధికారంలోకి తేవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- బిఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలను తెలుసుకోవాలి
- ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ఉంటాం



2 లో...

- బోనకల్ బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో లింగాల కమల్ రాజు

## మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

- పన్నులు నీటి బిల్లులు సకాలంలో చెల్లించాలి
- ట్రేడ్ లైసెన్స్ భావన నిర్మాణ అనుమతులు తప్పనిసరి: కమిషనర్ సాయి కృష్ణారెడ్డి

**కల్లూరు, సెప్టెంబర్ 21: ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో కీలకమని మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు పారిశుధ్య త్రాగు నీరు వీధి దీపాలు డ్రైనేజీ సేవలందించేందుకు ప్రతి ఒక్కరు మున్సిపాలిటీకి సహకరించాలని కూడా.

**పన్నుల సకాలంలో చెల్లించాలి**



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పనులు నీటి బిల్లులను నిర్ణీత సమయంలో చెల్లించాలని సూచించారు. పండ్ల ద్వారా వచ్చే ఆదాయం మున్సిపాలిటీ అభివృద్ధి ప్రజా సేవలకు వినియోగిస్తామని తెలిపారు. బకాయిలు చెల్లించని వారిపై నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి**

మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని కమీషనర్ సూచించారు.లైసెన్స్ లేకుండా లేదా గడువు ముగిసిన లైసెన్స్ తో వ్యాపారం నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**అనుమతితోనే భావన నిర్మాణాలు**

ఇళ్లు వాణిజ్య భవనాల నిర్మాణానికి ముందుగా నే మున్సిపల్ అనుమతి తీసుకోవాలని తెలిపారు అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం మంజూరైన ప్లాన్ కు విరుద్ధంగా

మిగతా 2 లో...

# మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

(మొదటి పేజీ తరువాయి...)

నిర్మించడం చేయరాదు అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణాలపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**పారిశుద్ధ్యం పై ప్రజల బాధ్యత**

ఇళ్లలోని తడి పొడి చెత్తను వేరువేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. రోడ్ల డ్రైనేజీలు కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మీరు నిల్వ ఉండకుండా చూసి దోమల నివారణకు సహకరించాలని కోరారు.

**మనం మున్సిపాలిటీ మన బాధ్యత**

మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం అధికారుల బాధ్యత కాదని ప్రజల భాగ్యస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. పన్నులు నీటి బిల్లులు చెల్లింపు ట్రేడ్ లైసెన్సులు భవన నిర్మాణం అనుమతులు వారి శుద్ధి నిబంధనల విషయంలో ప్రజల సహకరించాలని కోరారు మన మున్సిపాలిటీ మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన నడుస్తుంది

**బోనకల్, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో నేడు కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన నడుస్తుందంటూ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. నాడు బిఆర్ఎస్ పాలనలో స్వర్ణ యుగం నడిచిందని తెలియజేశారు. బోనకల్ బీఆర్ఎస్ నూతన మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీనితో బోనకల్ మండల కేంద్రం గులాబీమయమైంది. బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రావినూతల నుండి బోనకల్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీతో పురవీధులు హోరెత్తాయి.. గులాబీ జెండాలు రెపరెపలాడుతుండగా, పార్టీ నినాదాలతో ప్రధాన వీధులు మార్మోగాయి.ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ... బోనకల్‌లో ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకు పరిమితమైన కార్యాలయం కాదని, ప్రజల కోసం పనిచేసే "జనతా గ్యారేజ్", ప్రజా సమస్యలపై పోరాడే పోరాట కేంద్రంగా ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.ప్రజలు తమ సమస్యలతో ఎప్పుడైనా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు.

గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిపై అవసరమైన పోరాటాలు నిర్వహించేందుకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజలను నయవంచన చేశారని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని, కమిషన్లతో కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల సమస్యలు, రైతులు, యువత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం మరింత స్పష్టతతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే,తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని , కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

బోనకల్ నూతన పార్టీ కార్యాలయం ద్వారా మండలంలోని ప్రతి గ్రామంతో పార్టీకి మరింత బలమైన అనుసంధానం ఏర్పడుతుందని కమల్ రాజు అన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన ప్రతిసారీ బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన నిలబడతారని స్పష్టం చేశారు "ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ఉంటాం.. ప్రజలకు అండగా నిలుస్తాం.. అవసరమైతే ప్రజల కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తాం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి బానోత్ కొండ, గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, పార్టీ మండల నాయకులు పార ప్రసాద్, వేమూరి ప్రసాద్ ,జంగా రవి, మోదుగుల నాగేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు ,గద్దల వెంకటేశ్వర్లు ,ఇటికాల శ్రీనివాసరావు ,చొప్పకట్లపాలెం హుస్సేన్ భాయ్, ఆళ్లపాడు సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరరావు, లక్ష్మీపురం సర్పంచ్ మర్రి సిలువ, తన్నీరు పుల్లారావు, వడ్డే నరేష్, కొనకంచి నాగరాజు, జెర్రిపోతుల రవి, గుండపునేని సుధాకర్ రావు ,చావా హనుమంతరావు ,బెజవాడ మల్లికార్జున్ ,కొమ్మినేని ఉపేందర్, మడావత్ సైదా నాయక్, తేలూరు రమేష్, యార్లగడ్డ రమేష్, మోర్ల శ్రీను, గంగుల పుల్లయ్య, మరిదు శేషు, షేక్ మేరా సాహెబ్, యోగి శ్రీనివాస్, తాళ్లూరు జ్యోతి, జర్పుల లావణ్య, గ్రామ శాఖ సభ్యులు ,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం,పునరావాసం–పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు.నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా,ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు.భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు.ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్ సిఈ వాసంతి, డిసిఎస్ఓ చందన్ కుమార్, ఇరిగేషన్ ఈఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఫలాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా ప్రకారం సంపూర్ణంగా అందాలి

(మొదటి పేజీ తరువాయి...)

అవకాశాలు కల్పించే రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని వచ్చే నవంబర్ మాసంలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాల్లో అంగన్వాడీ భవనాల స్థల సేకరణ, నిర్మాణాల విషయమై చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు, నాణ్యమైన సౌకర్యాలను కల్పించాలని తెలిపారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన నిధులను తప్పనిసరిగా ఆయా వర్గాల నివాస ప్రాంతాలు, తండాలు, కాలనీల అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీ శాఖల పరిధిలోని సానిటేషన్ వర్కర్లందరికీ మెరుగైన సామాజిక భద్రత, సురక్షిత పని వాతావరణం కల్పించే చర్యలను తక్షణమే అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కోటి రూపాయల భీమా కల్పించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ త్వరగా పూర్తి చేసి బాధితులకు పరిహారం,న్యాయం అందించాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమాల్లో తహశీల్దార్లు,స్టేషన్ హౌజ్ అధికారి స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనెలా చూడాలన్నారు.ప్రజల్లో మూఢ నమ్మకాలు, చట్టాలపై అవగాహన కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలపై చైతన్యం తేవాలన్నారు. జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని చైర్మన్ సూచించారు.మంగళవారం జరగనున్న హైకోర్టు కమిటీ మీటింగ్ దృష్ట్యా, ఎస్సీ/ఎస్టీ అట్రోసిటీ కేసుల పెండింగ్ బకాయిలు, ఇంటర్–కాస్ట్ మ్యారేజెస్ ప్రోత్సాహకాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కమిషన్‌కు సమర్పించాలన్నారు.సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఏ అంగన్వాడీ కేంద్రం ప్రైవేట్ భవనాల్లో ఉండకూడదనే లక్ష్యంతో స్వంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు జిల్లాలో దాదాపు 494 విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులో సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 19 సంక్షేమ పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నందున, వాటికి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కింద ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున లభించిన 5 స్కూళ్లకు మ్యాపింగ్ చేసి, ప్రైవేట్/శిథిలావస్థలో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను ప్రాధాన్యత ప్రకారం ఇక్కడికి తరలిస్తామని అన్నారు. బోనకల్,రఘునాథపాలెంలలోని స్కూళ్లు వచ్చే విద్యాసంవత్సరం నాటికి, మిగిలినవి వచ్చే ఏడాది డిసెంబర్/జనవరి నాటికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.జిల్లాలో 797 కేసుల్లో 930 బాధితులకు 12 కోట్ల 42 లక్షల 50 వేల పరిహారం మంజూరు కాగా, 9 కోట్ల 5 లక్షలు అందజేసినట్లు, మిగతా నిధులు అందగానే చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి విలువైన సూచనలు, సలహాలు అందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యులకు జిల్లా యంత్రాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు.సమీక్షల్లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, జిల్లాలో 2017 నుండి ఇప్పటి వరకు 878 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయ్యాయన్నారు.ఇందులో 194 ఫాల్స్ కేసులు కాగా, 684 కేసుల్లో 653 కేసులకు ఛార్జ్ షీట్ దాఖలు, 8 కేసులకు శిక్షలు పడగా మిగతా కేసులు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా, పరిహారం పొందేలా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కమిటీ అనధికార సభ్యులు,వివిధ శాఖల జిల్లా అధికారులు,ఏసీపీలు, ఎంపిడిఓలు,మునిసిపల్ కమీషనర్లు,తహశీల్దార్లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# పట్టుదలే పెట్టుబడిగా..
# వైద్య విద్యలో మెరిసిన సాయి వరుణ్

- **పేదరికాన్ని అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన ప్రతిభావంతుడు..**
- **2088 ర్యాంక్‌తో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశం**
- **ఎంబీబీఎస్ సీటు సాధించిన సాయి వరుణ్‌ను సన్మానించిన జేపీసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్**





**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 21:** పేదరికాన్ని అధిగమించి పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన బుడిగెం సాయి వరుణ్‌ను జేపీసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ సన్మానించి అభినందించారు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా చదువుపై దృష్టి సారించి వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమని ఇజ్రాయిల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బీరోలు గ్రామానికి చెందిన. సాయి వరుణ్ ఎంబీబీఎస్ సీటు సాధించిన విషయం తెలుసుకున్న జేపీసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్.సోమవారం సాయి వరుణ్ నీ ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సాయి వరుణ్ సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. సాయి వరుణ్ సాధించిన విజయం ఎంతో మంది పేద విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సాయి వరుణ్ నిరూపించాడన్నారు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయినప్పటికీ వెనుకడుగు వేయకుండా చదువును కొనసాగించి ఎంబీబీఎస్ సీటు సాధించడం అతని పట్టుదలకు నిదర్శనమన్నారు.సాయి వరుణ్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఇజ్రాయిల్ ఆకాంక్షించారు. వైద్య విద్యను కేవలం వృత్తిగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలని సూచించారు. పేద కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను చూసి చదువును మధ్యలో ఆపకుండా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు.

**అమ్మమ్మ వద్ద ఉంటూ విద్యాభ్యాసం..**

మండలంలోని బీరోల్ గ్రామానికి చెందిన,బుడిగెం శ్రీలత–వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడైన సాయి వరుణ్ చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయాడు. అనంతరం మండలంలోని. రఘునాథపాలెం గ్రామంలో అమ్మమ్మ అల్లి యశోద తో కలిసి ఉంటూ తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. రఘునాథపాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన అనంతరం ఏన్కూర్ గురుకులంలో సెకండరీ విద్యను పూర్తి చేశాడు.చదువుపై ఆసక్తి,పట్టుదలతో ముందుకు సాగిన సాయి వరుణ్ 2025–26 ఎంసెట్‌లో 2088 ర్యాంక్ సాధించాడు. ఈ ర్యాంక్‌తో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థి వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.సాయి వరుణ్ సాధించిన విజయాన్ని గ్రామ పెద్దలు అభినందించారు. గౌని మల్లయ్య, తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, ఎర్రబోయిన వెంకన్న, కోండ్రు మహేష్ తదితరులు సాయి వరుణ్ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో అడుగుపెట్టిన సాయి వరుణ్.. మరెందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

## అఖిల భారత రైతు కూలి సంఘం జాతీయ మహాసభను జయప్రదం చేయండి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఈనెల ఖమ్మం నగరంలోని 28.29.30తేదీల్లో జరగబోయే అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ప్రదర్శన తీయడం జరిగింది.ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం నుండి ప్రదర్శన ర్యాలీ, ఎన్ఎస్పి రోడ్డు,రైతు బజార్, భక్త రామదాసు,కళాక్షేత్రం, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ మయూరి సెంటర్ వైరా రోడ్డు ఇల్లందు క్రాస్ రోడ్డు గట్టయ్య సెంటర్ మీదుగా డప్పు దళాలతో, రెడ్ షర్ట్ వాలంటీర్స్ ప్రదర్శన ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది ఈ సందర్భంగా, ఏఐకేఎంఎస్ జాతీయ నాయకులు, జె వి చలపతిరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు కూలీలకు వ్యతిరేకంగా పాలన కొనసాగిస్తుంది నీ విమర్శించారు.దేశ వ్యాప్తంగా ఏలినోవా ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ రాష్ట్రంలో కూడా అటువంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు,, దేశంలో కి తక్కువ లేదా సున్నా సుంకాలతో వ్యవసాయ ఉత్పత్తులు రావడం వల్ల దేశీయ రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పత్తుల వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం,బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలిమహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పేరును మార్చడంతో పాటు రాష్ట్రాల వాటాను భారీగా పెంచే చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తున్నారని విమర్శించారు. సమైక్య పోరాటాల ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.అంత్యోదయ పథకం కింద నిరుపేద కుటుంబాలకు ప్రస్తుతం అందుతున్న 35 కిలోల బియ్యం విధానాన్ని మార్చి వ్యక్తికి 7 కిలోల చొప్పున ఇవ్వాలని ప్రతిపాదించడం పేదలపై భారాన్ని మోపడమేనన్నారు. ఈ సవరణలను ఉపసంహరించుకుని ప్రతి నిరుపేద కుటుంబానికి 35 కిలోల బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలి2025 విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్ రంగంలో రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని నాయకులు విమర్శించారు.విద్యుత్ ఉత్పత్తి, సరఫరా,పంపిణీ రంగాలను కేంద్రీకరించడం, స్మార్ట్ మీటర్ల పేరుతో ముందస్తు చార్జీలు వసూలు చేయడం, ఉచిత విద్యుత్‌కు ముప్పు కలిగించడం, క్రాస్ సబ్సిడీని రద్దు చేయడం వంటి చర్యలు సామాన్య వినియోగదారులపై తీవ్ర భారం మోపుతాయని అన్నారు.తెలంగాణలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతున్నప్పటికీ,భవిష్యత్తులో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం లేదా విద్యుత్ చార్జీలు విధించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యుత్ రంగాన్ని క్రమంగా ప్రైవేటీకరించే చర్యలను అడ్డుకోవాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు,రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, మామిడాల బిక్షపతి, గైని ఐలయ్య, మాజీ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న , రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య నందగిరి వెంకటేశ్వర్లు, ఏనుగు చంద్రారెడ్డి, శంకర్, సైదులు దేవేందర్, జడ సత్యనారాయణ, ఆదిలక్ష్మి ,, వైప్రకాష్ వెంకటరామిరెడ్డి, ఐఎఫ్టియు,నాయకులు అనురాధ, పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి,మంగా, ఎం గిరి ఎస్కే కాసిం రాజేంద్రప్రసాద్ లక్ష్మీనారాయణ, రమేష్,అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శి కిషన్, ,నాగన్న నాగన్న, ఐ వెంకన్న జానకి,లక్ష్మక్క మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.




## క్యాన్సర్ మహమ్మారీని పరద్రోలెందుకే హెచ్ పి వి వ్యాక్సిన్

- **యు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ**
- **న్యూఈరా ఉన్నత పాఠశాలలో బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** క్యాన్సర్ మహమ్మారిని పూర్తిగా పరద్రోలెందుకే ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు యూ పి హెచ్ సి వైద్యాధికారి ఐ దేవిశ్రీ పేర్కొన్నారు. సమూలంగా నిర్మూలించేందుకే హెచ్పీవీ వ్యాక్సిన్ బాలికలకు ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు.సోమవారం న్యూఈరా ఉన్నత పాఠశాలలో 14ఏళ్ళు నిండిన 22మంది బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. బాలికల్లో భవిష్యత్తులో గర్భశాయ క్యాన్సర్ రాకుండా నిరోధించిందానికే ఈ వ్యాక్సిన్ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ లక్ష్యంతో జిల్లా కలెక్టర్ దివాకర ఐ ఏ ఎస్ ఆదేశాలమేరకు జిల్లా వైద్యాధికారి ది రామారావు పర్యవేక్షణలో ఈ కారక్రమం అమలుజరుగుతుందన్నారు.అధికారికంగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్నప్పటికీ దీనిపై కొంత మంది అపోహలు,అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని పేర్కొంటూ దానిని తీవ్రంగా ఖండించారు.దీనివల్ల ఎలాంటి చెడుప్రభావాలు ఉండవని,అర్హులైన ప్రతీ బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్నామని ఇందుకోసం తాము అన్ని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.దీనికిపాఠశాలలయాజమాన్యాలు,తల్లి,దండ్రులు బాధ్యత తీసుకోవాలని ప్రతీఒక్కరూ సహకరించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు.వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం డాక్టర్ దేవిశ్రీ, హెచ్ ఈ ఓ రమణ,విద్యార్థులకు, పాఠశాల సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, రాబిస్, పాముకాటు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశాలపై పిల్లల కుటుంబసభ్యులకు ఈ వ్యాక్సిన్ కార్యక్రమంపైన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ తోపాటు సూపర్ వైజర్లు ci హెచ్ రమణ, జడ్ ఎస్ జయపాల్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ,ఏ ఎన్ ఎం లు వి శారద, బి సంధ్య, ఎస్ కె రహీంబి, ఆశకార్యకర్తలు రమాదేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణమే మనందరి బాధ్యత

- **ఖమ్మం ఎస్బిఐ జడ్పీ బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటిన ఆర్ఎం, జెడ్పీ బ్రాంచ్ మేనేజర్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్వచ్ఛతా హి సేవ 2026 , మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎం రామమూర్తి పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పి ఎస్బిఐ బ్యాంక్ బ్రాంచ్ ఆవరణలో బ్యాంక్ మేనేజర్ షేక్ ఇబ్రహీం నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలను నాటి మాట్లాడారు.. వచ్చేనెల రెండవ తేదీన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా,స్వచ్ఛ భారత్ దివస్ లో భాగంగా మన పరిసర ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు మనందరం పాటుపడాలని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నీ పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తారని,స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు.. ప్రస్తుతం మొక్కలు నాటే కార్యక్రమంలో అనేకమంది యువత, ప్రజలు ఉత్సాహం చూపాలని తమ జన్మదినోత్సవాలు ఇతర వేడుకలలో సందర్భంగా ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించినప్పుడే ఆరోగ్య సమాజాన్ని నిర్మించిన వారమవుతామని ఆయన ఉద్ఘాటించారు.అనంతరం బ్యాంకు మేనేజర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ ప్రతి ఎస్బిఐ బ్యాంక్ ఉద్యోగి తమ వేడుకలు సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు బ్యాంక్ ఆవరణలలో తమ గృహ సముదాయాల వద్ద మొక్కలు నాటి ఆకు పచ్చని ప్రపంచంగా తీర్చిదిద్దుతూ పర్యావరణాన్ని కాపాడుదామని ఆయన పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు రాంభరన్, శ్రీలక్ష్మి , బ్యాంకు సిబ్బంది ఎస్బిఐ బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.





## ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన 11 మంది పోలీస్ అధికారులు ఎస్ డి .జలీల్,జె.రవి, ఎస్.కె . ఖాసిం అలీ, కె.వెంకటేశ్వర రావు,కె.చెన్నారావు,ఎస్.శ్రీనివాసరావు,బి.పిచ్చయ్య,జి.హరి,ఎస్.వెంకట కోటిరెడ్డి,ఆర్.కాళహస్తి, బి.పెద రాజేందర్ లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి,అభినందనలు తెలియజేశారు.పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం,అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

## బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోటార్ కు మరమ్మతు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ చేరుకుపల్లి బాలు సోమవారం రిపేర్ లో ఉన్న మోటార్ కు మరమ్మతు చేసి అందుబాటిలోకి తేవడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ చిన్న మున్నేరు వైకుంఠ దామంలో గత రెండు నెలలుగా నీళ్ల మోటార్ రిపేర్ లో ఉన్నది.దింతో వైకుంఠ దామంకు అంత్యక్రియలు నిమిత్తం వచ్చే ప్రజానీకానికి నీటి సౌకర్యం అందుటులో లేకపోవడంతో, పక్కనే ఉన్న మున్నేరు లోకి దిగి మురికి నీరు ను వాడుతున్నారు.అంత్యయక్రియలకు వచ్చే ప్రజానీకం కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకునేందుకు మరియు బంధుగణం స్నానం చేసేందుకు ట్యంక్ లో నీళ్లు లేక కటకటా ఏర్పడింది. మోటర్ మరమ్మతు సమస్యను ఎన్ని సార్లు సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులకు తెలియజేసిన ఫలితం లేకుండా పోయింది.దింతో బాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్పందించి తన సొంత ఖర్చులు వెచ్చించి వైకుంఠ దామంలో ఉన్న మోటార్ కు ట్రస్ట్ సభ్యుల సహకారంతో మరమ్మతు చేయించి నీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.వైకుంఠ దామంలో సోమవారం నుంచి యథావిధిగా నీటి సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు.మోటారు మర్మతుకు కృషి చేసిన వారి లో స్థానిక పార్టీల లీడర్లు కొప్పుల నరసింహారావు,క్యాబ శ్రీను,రఘు,గజ్జల వెంకన్న,పత్తిపాక శ్రీను, కొప్పెర ఉపేందర్,గుండెపోగు చిరంజీవి,ట్రస్ట్ సభ్యులు చెరుకుపల్లి ప్రవలిక,పి.వేణు,కె.సైదులు,గురవయ్య, కె.కాశయ్య,గట్టి కొం డ చుకయ్య తదితరులు ఉన్నారు.

## గుండెపోటుతో ఆర్ఎంపి వైద్యుడు మృతి



**కారేపల్లి, సెప్టెంబర్ 21, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు పుల్లారావు (42) గుండెపోటుతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు.ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన పుల్లారావు పాతికేళ్ల కిందట మాదారం గ్రామానికి వచ్చి ఆర్ఎంపి వైద్యుడిగా పని చేస్తున్నాడు. పుల్లారావు మృతితో మాదారం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.స్థానిక సర్పంచ్ ఉమా నరేష్ తో పాటు పలువురు పుల్లారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పుల్లారావుకు సంతానం లేకపోవడంతో ఒక బాబును దత్తత తీసుకొని భార్య నీల తో కలిసి మాదారంలో నివసిస్తున్నాడు.సుమారు రెండున్నర దశాబ్దాల పాటు మాదారం పరిసర ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవనందించిన పుల్లారావు ఆకస్మిక మరణం తీరని లోటని పలువురు అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పుల్లారావు అకాల మరణానికి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిట్టల నాగేశ్వరరావు, అనంతారపు వెంకటాచారి పుల్లారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# నిషేధిత భూముల జాబితాలో పేదలు

- 22 ఏ క్రింద సింగరేణిలో 3వేల ఎకరాలు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**కారేపల్లి, సెప్టెంబర్ 21, ప్రజా జ్యోతి:** పేదల సాగు చేస్తున్న భూములు నిషేదిత జాబితాలో ఉండటంతో వారు తీవ్రమనోవేదనకు గురవుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. తెలంగాణ రైతు సంఘం బృందం సోమవారం సింగరేణి మండలంలో 22ఎ జాబితాలో సాగు భూములు ఉన్నరైతులతో సమావేశాలు నిర్వహించి నిషేధిత భూమిలో ఉన్న సాగు భూమి వివరాలను సేకరించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పేరుతో వేలాది ఎకరాల సాగు భూము లు పార్ట్ –2 లో ఉంచితే నేటి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పేరుతో 22 ఏ జాబితాను మరింత పెంచి రైతులకు ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందని విమర్శించారు. రైతులు తమ సాగు భూమి కి కనీసం బ్యాంకు రుణా లు పొందలేని పరిస్థితి ఉందన్నారు. తమ వారసులకు భూమి బదిలీ చేయుటకు అవకాశం లేదని, భూమి యాజమాని చనిపోయిన తమ వారుసులకు భూమి హక్కులు బదిలీ చేయుటకు రెవిన్యూ అధికారులు 22 ఎ జాబితాను కారణం చూపుతున్నారని తెలిపారు. సింగరేణి మండలంలో 22ఏ జాబితాలో రేలకాయలపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నెం. 107, మాణిక్యారం రెవిన్యూ గ్రామంలో సర్వే నెం. 70 , కోమట్లగూడెం రెవిన్యూ గ్రామంలో సర్వే నెం. 15 లలో సుమారు 2 వేల ఎకరాల తోపాటు ఇతర గ్రామ రెవిన్యూ పరిధిలో మరి కొన్ని సర్వే నెంబర్ల కు చెందిన వేయ్యి ఎకరాలు నిషేధీత జాబితాలో ప్రభుత్వం ఉంచిందన్నారు. 22ఏ క్రింది సాగు భూములు ఉండటం వలన బ్యాంకులో తీసుకున్న రుణాలు రెన్యూవల్ కాక పోవటంతో పాటు అధికవడ్డీ తో పాటు పూర్తిగా చెల్లించాలని నోటీసులు పంపిస్తున్నారన్నారు. తక్షణమే 22 ఏ జాబితాలో ఉన్న సాగు భూములను తొలిగించి రైతులకు అని హక్కులు పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ, కారేపల్లి మండల కార్యదర్శి వజ్జా రామారావు, సిఐటియు జిల్లా నాయకులు కుందనపల్లి నరేంద్ర, మాజీ సర్పంచ్లు భూక్యా రమణ, బానో తు సక్రామ్, రైతులు పిప్పల కృష్ణ, గణి తి సత్యనారాయణ, తారాచంద్, బుడి గ రాజయ్య, శోభన్, భద్రయ్య, నరసింహారావు, వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వరకట్న వేధింపుల కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు జే ఎఫ్ సి ఎం కోర్టు న్యాయమూర్తి వై.బిందుప్రియ తీర్పు చెప్పారు.ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నం.239/2020, CC No.2533/2020, ఐపీసీ సెక్షన్ 498–A, వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసిన ఈ కేసులో మదినేని బోసుబాబు,40 సం పాత కాచారం గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా నివాసి,నిందితుడు–1గా ఉన్నారు.విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష,రూ.5,000 జరిమానా విధించింది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా అప్పటి ఎస్సై ఎం.డి.మౌలానా,బ్రీఫింగ్ అధికారి ప్రస్తుత ముదిగొండ పోలీస్ స్టేషన్ సిఐ మురళి వ్యవహరించారు. కేసు దర్యాప్తు,కోర్టు విచారణ ప్రక్రియలో ఏ పి పి గాయత్రి,సీడీఓ సిహెచ్. శ్రవణ్, ప్రాసెస్ సిబ్బంది లైజన్ అధికారులు కె.శ్రీకాంత్,ఎస్ఐ, హెచ్ సి డి.నాగేశ్వరరావు, హోంగార్డ్ ఎం.కాంతారావులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

## శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదానం

**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 21**తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకరవాయి గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్–పద్మ దంపతులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి, అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో మండల ఎంపీఓ షేక్ మీరా, పంచాయతీ కార్యదర్శి అంబాల అంజి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమానికి భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శివ గణేష్ యూత్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, దాతలు కృషి చేశారు.ఈ కార్యక్రమానికి విగ్రహ దాతలు ఏలేం నాగరాజు–నాగమణి, అన్నప్రసాద దాతలు మూడు నాగేశ్వరరావు–దేవి, పత్తి రాంబాబు–కవిత, కొలిశెట్టి బిక్షమయ్య–మనమ్మ, కొలిశెట్టి శాంభవి–వేణు, మండలి సైదులు–విజయలక్ష్మి, దంతాల నరసింహారావు–వసంత, జతిన్, శ్రీ సత్యనారాయణ రైస్ మిల్ తదితరులు సహకరించారు. అలాగే చీరల దాతలు రాగి బ్రహ్మచారి–ఉదయకుమారి, చెన్న మీనయ్య–స్వాతి తదితరులు పాల్గొని కార్యక్రమానికి తమవంతు సహకారం అందించారు. శివ గణేష్ యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## సాగర్ నీటి కోసం శ్రమిస్తున్న గ్రామస్తులు

- రెండు రోజుల నుండి కాలువ మీద కష్టం చేస్తున్న రైతులు



**బోనకల్ , సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి ):**మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామం లోవున్న తాళ్లచెరువులో సాగర్ నీటినీ నింపటం కోసం ఆ గ్రామస్తులు శ్రమిస్తున్నారు. గ్రామ వైస్ సర్పంచ్ వడ్డెబోయిన ఉపేంద్ర, పంచాయతీ వార్డు మెంబర్లు వడ్డబోయిన సతీష్ ,ఇస్రం వినోద్, దారా సురేష్ ,దారా నరేష్, ధారా ములు,వడ్డెబోయిన చుక్కయ్య , వడ్డెబోయిన నాగేశ్వరరావు, వడ్డెబోయిన ఉద్దండు మైనార్టీ కాంగ్రెస్ పార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రంజాన్, షేక్ బజ్జీ, ఇష్టం కుటుంబరావు షేక్ మదర్ సాహెబ్, బుష్పోగు తిరుపతిరావు, షేక్ నాగుల్ మీరా మొదలగువారు రెండు రోజుల నుంచి ఎన్ఎస్పీ కాలవ మీద శ్రమిస్తున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి నీరు రావటానికి అవరోధాలు ఉండటంతో జెసిపి తో వాటిని తొలగించుకుంటూ నీటిని చెరువుకు మళ్లిస్తున్నారు. జెసిపి కి కావలసిన ఆర్థిక సహాయాన్ని గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన కావూరి రమేష్ అందిస్తున్నారు. గ్రామ రైతులు కావూరి రమేష్ కృతజ్ఞతలు తెలియజేసినారు.

## కాంగ్రెస్ యూత్ లీడర్ బీఆర్ఎస్‌లో చేరిక

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు



**బోనకల్, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల యూత్ అధ్యక్షుడు బంధం రంగా మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. కండువా కప్పి ఆయనతో పాటు పండగ సైదులు, షేక్ జావేద్, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాటికొండ జీవన్ కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మాజీ జెడ్పిటిసి బానోతు కొండ, బంధం నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- కాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి
- సిపిఎం డిమాండ్




**కల్లూరు సెప్టెంబర్ 21 : ప్రజా జ్యోతి** కల్లూరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ యువజన కార్యదర్శి వర్గ సభ్యుడు తన్నీరు కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే లో సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్ర భుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సర్దుబాటు పేరుతో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను బదిలీ చేసే ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటివరకు యూనిఫాంలు అందని విద్యార్థులకు వెంటనే యూనిఫాంలు అందించాలని ఐదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ వర్క్ బుక్స్ గణిత పుస్తకాలు సరఫరా చేయాలని అన్నారు వంట గదులు లేని పాఠశాలల్లో వెంటనే వంట గదులు నిర్మించాలని బాలికల ఉన్నత పాఠశాలలో సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు బాలికలకు సానిటరీ ప్యాడ్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న పరిస్థితుల్లో సర్దుబాటు పేరుతో బదిలీలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడనాడి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## గణేశునికి ఘనమైన పూజలు చేసిన మండల అధికారులు





**కారేపల్లి, సెప్టెంబర్ 21, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లోని అంబేద్కర్ సెంటర్లో గల డిటి జాముల నాయక్ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద సోమవారం సింగరేణి మండల అధికారులు, మండల ప్రముఖులు స్వామివారికి ఘనమైన పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరికీ ఆ గణేశుని స్వామి దయవల్ల విఘ్నలు తొలగి అంతా శుభాలు జరగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు అభివృద్ధి చెందాలి, విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వి. వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి. పద్మ, ఎస్సై బైరు.గోపి, ఎం పి ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఇమ్మడి తిరుపతి రావు, అడ్డగోడ ఐలయ్య, ఆదెర్ల రాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## యువనేత వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో అన్నదానం



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండలంలోని కండ్రిక గ్రామంలో యువనేత, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు పలువురు కాంగ్రెస్ మండల నాయకులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. వేజండ్ల గత 5 ఏళ్లుగా గణనాథుడి ఉత్సవాలను కేవలం వేడుకలకే పరిమితం కాకుండా గ్రామంలో గల బంజారాలందరిని భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తన సొంత ఖర్చులతో గణేష్ ఉత్సవాలను నిర్వహిచడంతో పాటు అన్నదానం,గ్రామోత్సవం, వినాయక నిమజ్జనం కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ ఏటా గ్రామంలో బంజారా యువత,మహిళలు గణేష్ ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరిస్తూ,సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న వేజండ్ల సాయికుమార్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, సర్పంచులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, తుళ్ళూరు నిర్మల కుమారి,రోజారాణి, భూక్యా రాము నాయకులు కర్నాటి సుధాకర్ రెడ్డి,దేవరకొండ బాబూరావు, రాజీవ్ గాంధీ,సందీప్ రెడ్డి, శ్రీనివాసరావు,రవి నాయక్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లాలో 23.09.2026న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా,నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా,సజావుగా జరిగేలా ఖమ్మం ఆపరేషన్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి.శ్రీనివాస చారి ,ఆపరేషన్ సర్కిల్, ఖమ్మం తెలి పారు.జిల్లాలో గుర్తించిన వివిధ నిమజ్జన కేంద్రాలు,ప్రధాన ఊరేగింపు మార్గాల్లో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఆయా అధికారులు తమ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా,విద్యుత్ లైన్ల కిందుగా విగ్రహాల సురక్షిత తరలింపు తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు.అదేవిధంగా 132/33 కేవీ, 33/11 కేవీ సబ్ స్టేషన్లు,ఇతర విద్యుత్ వ్యవస్థల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండి, ఫీల్డ్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు.నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగలు, ఇతర విద్యుత్ సంబంధిత అడ్డంకులు ఉంటే వాటిని ముందుగానే తొలగించి,విగ్రహాల ఊరేగింపు సురక్షితంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆపరేషన్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. 24 గంటల కంట్రోల్ రూమ్ సేవలు వినాయక నిమజ్జనం రోజున విద్యుత్ సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అధికారులు రౌండ్ ది క్లాక్ విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టారు. 23.09.2026 ఉదయం 9:00 గంటల నుంచి 24.09.2026 ఉదయం 7:00 గంటల వరకు అధికారులు కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తూ విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా పర్యవేక్షించనున్నారు.విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు, అత్యవసర సమాచారం కోసం ఖమ్మం జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 8712483490 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రజలకు సూచించారు.వినాయక నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు,నిర్వాహకులు మరియు భక్తులు విద్యుత్ భద్రతా నిబంధనలు పాటిస్తూ విద్యుత్ లైన్లకు దూరంగా విగ్రహాలను తరలించాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.



## కారేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ వల్లభినేని గురవయ్య మృతి



**కారేపల్లి, సెప్టెంబర్ 21, ప్రజా జ్యోతి :** కారేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ వల్లభినేని గురవయ్య(83)సోమవారం మృతి చెందారు. సింగరేణి మండల విశ్వనాధపల్లికి చెందిన వల్లభినేని గురయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు వల్లభినేని రామారావు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రవాణా శాఖ ఖమ్మం జిల్లా సభ్యులుగా కొనసాగారు. గురవయ్య మృతికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధులు ఫోనులో ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. మృత దేహాన్ని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు భాగం హేమంత రావు, గాంధీ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీనివాసరావు, తాతా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, సోందు, సీపీఎం నాయకులు రేగళ్ల మంగయ్య, సైదులు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

## ఆవుల తరలింపు గుట్టు రట్టు.. లారీ సీజ్

- 50 ఆవులు స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు
- రూ.5 లక్షల విలువైన ఆవులతో హైదరాబాద్‌కు పయనం



**తిరులాపాలెం, సెప్టెంబర్ 21ప్రజా జ్యోతి :** విశాఖపట్నం జిల్లా సబ్బవరం నుంచి హైదరాబాద్ కు 50 ఆవులను లారీలో తరలిస్తున్న ఘటనను తిరుమలాయపాలెం పోలీసులు ఛేదించారు. ఆవులతో వెళ్తున్న లారీని పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. లారీలో ఉన్న ఆవుల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ఎస్సై కూచిపూడి జగదీష్ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా ఆవులతో వెళ్తున్న లారీ పట్టుబడింది. వెంటనే లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు అందు లో ఉన్న 50 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.లారీ డ్రైవర్‌ను విచారించగా తన పేరు భీమనపల్లి నగేష్, తండ్రి వెంకులు అని, నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన వ్యక్తినని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. లారీలోని ఆవులు విశాఖపట్నం జిల్లా సబ్బవరం ప్రాంతానికి చెందిన ఈశ్వరరావు వద్ద నుంచి హైదరాబాద్‌కు చెందిన మస్తాన్ కొనుగోలు చేసినట్లు డ్రైవర్ విచారణలో తెలిపినట్లు పేర్కొన్నారు.ఆవులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు డ్రైవర్ వెల్లడించడంతో పోలీసులు ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేపట్టారు. ఆవుల కొనుగోలు, విక్రయం, రవాణాకు సంబంధించిన వివరాలతో పాటు అవసరమైన పత్రాలు, అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించి లారీ డ్రైవర్ భీమనపల్లి నగేష్‌తో పాటు ఆవులను విక్రయించినట్లు పేర్కొన్న ఈశ్వరరావు, కొనుగోలు చేసినట్లు పేర్కొన్న మస్తాన్‌పై తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. లారీని, 50 ఆవులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ఎస్సై జగదీష్ చొరవతో పట్టివేత:**

ఆవుల తరలింపు వ్యవహారాన్ని గుర్తించి లారీని పట్టుకోవడంలో ఎస్సై కూచిపూడి జగదీష్ చొరవ చూపారు. లారీని ఆపి తనిఖీ చేయడంతో భారీగా ఆవుల తరలింపు విషయం వెలుగులోకి వచ్చింది. డ్రైవర్‌ను విచారించి కీలక వివరాలు సేకరించిన పోలీసులు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా పశువులను తరలించే వారిపై నిఘా కొనసాగిస్తామని ఎస్సై జగదీష్ తెలిపారు.ఆవుల తరలింపు వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.